

(గత సంచిక తరువాయి)

# బంగారి

కోటమర్తి రాధాహిమబిందు

మరో గంట తర్వాతనే మళ్లీ వెళ్లాను బంగారి ఇంటికి. సమయానికి కోడలు ఇంట్లో లేదు. మంగ మీద చాలా కోపం వచ్చింది నాకు. ఏదేదో అన్నాను మంగని. బంగారి మౌనం వహించింది.

'మంగని ఏమన్నా ఏం లాభం? ఏ హక్కుతో బంగారి తరఫున మాట్లాడగలను? మళ్లీ బంగారిని నాయింటికి ఎలా తెచ్చుకోవటం? బంగారికి ఒకే మాట చెప్పాను.

"ఇక మీ ఏ విషయాల్లో జోక్యం చేసుకోను. కానీ నువ్వు మాత్రం ఎలాగైనా పనికి రావాలి. మబ్బు చూసి ముంత ఒలకపోసుకున్నట్లయింది నా పని" బాధగా అంటున్న నన్నే చూసింది బంగారి.

ఈ విషయం వినే వాళ్లకు అతిమామూలుదే అయినా నా మనసుకు మాత్రం తీవ్రసంక్షోభాన్నే కలిగించింది. ఏదో చెప్పబోతే మరేదో అయింది.

"బంగారీ"

"అది చాలా మొండిమనిషి."

"మరి నువ్వు రావా బంగారీ?"

"చూస్తా అయ్యా. అది చెప్పింది వినకపోతే ఆ కోపం ఈ కోపం వాడి మీద చూపిస్తుంది." బాధగా వెనక్కు వచ్చాను నేను.

క్రుంగిపోతున్న నా మనసును అదుపులో ఉంచుకోలేక ఓ రెండు రోజులు బ్యాంకుకు సెలవు పడేశాను. పావని నా మనసెరిగి నాతో నా బాధను పంచుకుంది.

రోజులు గడుస్తున్నాయి గాని బంగారి రాలేదు. ఎంతో నిరాసక్తిగా బ్యాంకు పనులను నిర్వర్తిస్తున్నాను. ఇంటికి రాగానే ఇదే చర్చ.

విషయం వింటే ఎవరైనా నవ్వుకోవచ్చు. హాయిగా మరో పనిమనిషిని పెట్టుకునే బదులు ఇదేం చాదస్తం? మరో వంద పారేస్తే ఆ బంగారి నా ఇంటికి రాగలదు? ఎన్ని వేలు ఇస్తే నా ఎదురుగా నిలబడి చిరునవ్వులు చిందిస్తూ నాతో మాట్లాడగలదు? నా గోడు నాది. ఇది ఎవరికీ అర్థం గానిది. ఎవరికో అర్థం అవాల్సింది లేదు. మరో నాలుగు రోజులు గడిచాయి. బంగారి రాలేదు. ఏమైతే అదవుతుందని ఆ రోజు మేం ఇద్దరం బండి మీద బంగారి ఇంటికి కెళ్లాం. బయట మంచం మీద కూర్చుని సెనక్కాయలు తింటూ దర్శనమిచ్చింది మంగ. కనీసం మంచం మీది నుండి కూడా లేవలేదు.

"ఏసోబు ఉన్నాడా?"

"లేదు పనికి పోయిండు" ఎటో చూస్తూ చిరాగ్గా చెప్పింది. బంగారి గురించి అడిగాను. జ్వరం వస్తుందని నిర్లక్ష్యంగా చెప్పింది. ఇద్దరూ లోపలికి వెళ్లాం మంగ పర్మిషన్ తీసుకోకుండానే.

అప్పట్లో బంగారి కోసం వెతికిన బాధ కంటే ఈ బాధ కొన్ని వందల రెట్లు ఎక్కువవుతుంది. అవును మరి, చేతిలోకి వచ్చిన అదృష్టాన్ని చేజార్చుకున్న అవివేకి తను.

"బంగారీ... బంగారీ" మంచంలో నిస్త్రాణంగా పడుకుని వున్న బంగారి మీదికి వంగి పలుకరించాను.

కళ్లు తెరిచింది బంగారి. ఆ కళ్లలో ఎంతో వెలుగు "అయ్యా" అంటూ చేయి పట్టుకుని నిమిరింది.

"ఎట్లా ఉంది బంగారీ" పలుకరించింది పావని.

"అమ్మా... బాగున్నావా" ఎంతో ప్రేమగా చూసింది పావని వైపు.

"ఎట్లా ఉంది బంగారీ.. ఆస్పత్రికి పోయినావా? డాక్టర్‌కి చూపించుకున్నావా? అయ్యో... వొళ్లు కాలిపోతుందే... మంగా...మంగా...." పెద్దగా కేక వేసింది పావని.

మంగ గుమ్మం దగ్గరికి వచ్చి" "ఏంటి" అంది.

"బంగారిని డాక్టర్‌కి చూపించావా" గట్టిగా అడిగింది.

"డబ్బులెక్కడున్నయ్" పొగరుగా సమాధానం ఇచ్చింది.

"పని చేసుకునే ఆమెను కట్టుదిట్టం చేసి పనికి రానీయలేదు. మరెక్కడి నుండి వస్తాయి డబ్బులు? అమ్మ పెట్టదూ అడుక్కు తిననీయదు అన్న సామెతగా చేస్తున్నావే! నువ్వు చూడవు... తన బతుకును తను చూసుకోనీయవు... ఎందుకంత అథారిటీ?" మరింత కోపంగా అడిగింది.

పావని అలా నిలదీస్తుంటే నాకెంతో ముచ్చటగా అన్పిస్తుంది.

"బంగారీ... లే. ఏమండీ మీరెళ్లి ఆటో తెండి. ప్చ్.. బంగారీ... ఎలా అయిపోయావ్... అసలు నువ్వు ఏమీ తినటల్లే వుంది. ఇదిగో అమ్మాయ్ మంగా... ఇట్లా చేయటం ఏం బాగా లేదు."

"మీరెవరండీ నాకు చెప్పటానికి?" నిలదీసింది మంగ.

"నేనెవర్నా? తోటిమనిషిని. సహాయం చేయగల మనస్తత్వం ఉన్నదాన్ని. సరా?" మంగని పట్టించుకోకుండా ఆటోలో బంగారిని తీసికెళ్లి డాక్టర్‌కి చూపించి వెనక్కి వస్తూంటే,

"అయ్యా"

"ఏంటి బంగారీ"

బంగారి మొహమాటపడింది. మేమిద్దరం నాలుగుసార్లు అడిగితే గాని పెదవి విప్పలేదు.

"టీ తాగబుద్ధవుతుంది. అదీ మనింట్లో టీ... అమ్మ పెట్టే టీ... నీళ్లు కలపకుండా పాలల్లో పొడేసి చేస్తుంది గదయ్యా... చాలా రుచిగా ఉంటుంది."

నా కళ్లు చెమర్చగా ఆటోని ఇంటి వైపు మళ్లించాను.

"బంగారీ, ఓ ముద్ద అన్నం తింటావా?" అడిగింది పావని.

తింటానన్నట్లుగా తల వూపింది బంగారి. ఆకులో ఇంత అన్నం, చింతకాయ పచ్చడి వేసి బంగారి ముందు పెట్టింది. మంచి నీళ్లు ఇచ్చింది. బంగారి ఆవురావురుమంటూ అన్నం తింటూంటే విస్తుపోయి చూశాం.

టీ చేసింది పావని. ఎంతో ఇష్టంగా తాగింది. బంగారిని ఆటోలో ఇంటి దగ్గర దింపి టాబ్లెట్స్, టానిక్ ఎలా వాడాలో బంగారితో పాటు మంగకీ చెప్పి బండి మీద ఇంటికి వచ్చాం ఇద్దరం.

ఎప్పటిలా బంగారి గురించి చర్చ మా మధ్య మొదలైంది.

**000**

ఆ రాత్రి పావని మార్దవంగా అడుగుతున్న ప్రశ్నకు నాకేం సమాధానం చెప్పాలో తోచలేదు. గదిలో కాస్సేపు పచార్లు చేశాను.

"ఎందుకండీ, బంగారి అంటే మీకు అంత ఇష్టం?" మళ్లీ అడిగింది పావని.

"నీ దగ్గర దాచేదేముంది పావనీ..." అంటూ దీర్ఘంగా నిట్టూర్చాను. పావని పక్కనే బెడ్ మీద కూర్చుండిపోయాను. నాకు తెలియకుండానే నా కళ్లు తడి అయ్యాయి.

"ఆ చిరునవ్వులో మా అమ్మ కన్పిస్తుంది. నాన్న చిన్నప్పుడే పోయారు అమ్మ మాకెన్నో చేసింది. మమ్మల్ని ఇలా తీర్చిదిద్దింది. నేనూ అమ్మకు చేయాల్సినవేవో కొన్నింటిని చేశాను. కానీ ఏదో అసంతృప్తి ఇంకా ఏవో చేయలేదే అని గుండె లోపల మెలి తిప్పే బాధ.

"అప్పట్లో మనం సాధారణంగానే బ్రతికాం. ఏవో బాధ్యత లున్నాయి. అన్ని బాధ్యతలు అయిపోయి ఇంత ఉన్నతంగా బ్రతుకుతున్న సమయంలో అమ్మ లేకుండా పోయింది. నన్ను ఈ స్థితిలో చూస్తే అమ్మ ఎంత గొప్పగా ఫీలయ్యేదో, ఎంత గర్వంగా అనుభూతి చెందేదో... సేమ్ టైమ్ నేను అమ్మని ఎంత బాగా చూసుకునేవాడ్నో! ఇది వరకు నేను చూసుకోలేదని కాదు... కానీ ఇంత బాగా అమ్మ పట్టుచీరెలు కట్టుకోవాలి. కార్లలో తిరగాలి. నా ఈ స్టేటస్‌కు తగ్గట్లుగా అమ్మను సంతృప్తిపరచాలి. తద్వారా నా మనసు తృప్తిచెందాలి.

"ఇంకా ఇలా చాలా చాలా...

"నాన్నగారు చనిపోయిన రోజుల్లో నేను, మా చిన్నక్కయ్య కలిసి ఒక ఊరు వెళ్లాం. అక్కడ నాన్నగారిలా ఓ వ్యక్తి కనిపించారు. అదే రూపం అదే మాట తీరు. అతనితో ఇద్దరం ఎంతో సేపు గడిపాం. ఆ వ్యక్తిని మా ఇంటికి అప్పుడప్పుడూ రమ్మని ఆహ్వానించాం. ఏదో పని మీద మీ టౌనుకు వస్తూనే ఉంటాను తప్పక మీ ఇంటికి వస్తాను అని మాట ఇచ్చాడు కూడా అతను... కానీ రాలేదు.

"మా ఆరాటం అతనికి ఉండదుగా పావనీ... మా అడ్రసు అతనికి తెల్సు అతని అడ్రసు మాకు తెల్సు. మమ్మల్ని అతను చూడాలని ఎందుకనుకుంటాడు? కానీ మేం మాత్రం చాలాసార్లు అతని గురించి మాట్లాడుకునేవాళ్లం. మళ్లీ మేం వెళ్లి చూడాలంటే ప్రయాణం చార్జీలకు పెట్టే డబ్బుతో ఒక రోజు ఇంటిల్లిపాదికీ కడుపు నింపే పరిస్థితి మాది. అయినా ఒకసారి వెళ్లాం. అదీ రెండు సంవత్సరాల తర్వాత అతని గురించి వాకబు చేశాం. ఆ ఇంటికి వెళ్లాం. మీ నాన్నగారి దగ్గరికే నేనూ చేరి పోయానంటూ దండ వేలాడుతున్న ఫోటోలో దర్శనమిచ్చాడు అతను. మేం ఇద్దరం చాలా బాధపడ్డాం.

"అలాగే బంగారి చిరునవ్వులో అమ్మ కన్పించింది పావనీ. బంగారికి ఏదో చేయాలి. బంగారిని సంతోషపెట్టాలి. ఎంతో ఆనందపరచాలి. ఆమె పనిమనిషి గావచ్చు. కానీ స్థానం అమ్మ స్థానం. అసలు బంగారిని మనతో పాటు మనింట్లో ఉంచుకోవాలని ఎంతో బలంగా ఉండేది. ఇప్పటికీ ఉంది. కానీ తీరేదెలా? ఆ రాకాసి బారి నుండి బయటకు రప్పించటం ఎలా? అదే తోచడం లేదు. అమ్మ చేయలేనివన్నీ బంగారికి చేసి అలా కొడుకుగా ఋణం తీర్చుకోవాలని ఉంది. అమ్మ అక్కడా ఇలాంటి చిరునవ్వు నవ్వి నన్నెంతో ఆశీర్వదిస్తుందని నా ఆత్మ చెబుతుంది.

**నేను రాత్రి వాడికి ఫోను చేయకపోతే.. చేసినా వాడు రాకపోయివుంటే... ఏసోబు చేతిలో బంగారి ప్రాణం పోయి వుండేదా? నన్ను చూసిన బంగారి దగ్గరికి రమ్మని సైగ చేసి వుంటే ఏసోబు తన స్థానం నాకు ఇచ్చివుంటే బంగారి ప్రాణం నా చేతిలో పోయి వుండేదా?**

"ప్చ్... నాలో ఏదో అర్థం గాని వెలితి వుంది. నాకో తృప్తి దక్కాలి. ఆ వెలితిని పూడ్చుకుంటూ ఆ తృప్తిని దక్కించుకోవాలి. ఆ తృప్తి ఈ బంగారి వల్ల నాకు తీరుతుంది. కానీ ఎలా సాధ్యం?

"అమ్మ ఎన్నో కష్టాలు అనుభవించింది. ఒక రకంగా కష్టాల కడలిని ఈదింది అనే చెప్పాలి. మా తలరాత... మేం ఎంతో సుఖపడదాం అనుకున్న సమయంలో మా అందర్నీ దాటుకుంటూ వెళ్లిపోయింది. ఎంతమందో మమ్మల్ని పొగడొచ్చు. ఎంతమందో మా ఈ ఐశ్వర్యాన్ని చూడవచ్చు. కానీ మన జన్మకు కారకులైన మన అమ్మా, నాన్న చూడలేనప్పుడు గుండెను చీల్చే బాధ మనసులో ఆలోచించేవాళ్లకే అర్థం అవుతుంది.

"సరే... మన పిల్లలు ఇదంతా అనుభవిస్తారు. అది వేరే విషయం పావనీ. నా మనసేంటో క్రుంగిపోతుంది. నేను రమేశ్‌కు ఫోను చేస్తాను వాడితో ఇదంతా చెప్తాను. వాడికి ఈ అనుభూతిని పంచుతాను" అంటూ నా తమ్ముడికి రింగ్ చేసి బంగారి విషయం అంతా చెప్పాను.

అంతా విని రమేశ్ ఒకే ఒక మాటన్నాడు... "నాకు బంగారిని చూడాలని ఉంది. రేపు ఎలాగూ ఆదివారం. నేను బయల్దేరి వస్తున్నాను" అన్నాడు.

నాకు తెలియకుండా నాలో ఏదో బలం, శక్తి వచ్చినట్లయింది. వాడి ఆసరా కోరుతూంది నా మనసు.

ఆ తర్వాత కాస్త నిద్రపోగలిగాను.

000

రమేశ్ వచ్చాడు. మొట్టమొదటిసారిగా బంగారిని చూసిన దగ్గరి నుంచి ఇప్పటి వరకు అంతా మరోసారి వివరంగా చెప్పాను. వాడు నాకంటే ఎక్కువగా ఎమోషనల్‌గా ఫీలయ్యాడు. ముగ్గురం ఫ్రెష్ అయి టిఫిన్లు కానిచ్చాం. బంగారి ఇంటికి వెళ్దామను కుంటున్న సమయంలో ఒక అబ్బాయి వచ్చాడు...

"సార్, ఈ ఉత్తరం బంగారి మీకిమ్మంది."

"ఉత్తరమా!"

అవున్సార్. నాతో రాయించింది. నేను వ్రాసినందుకు ఓ బిస్కట్ పాకెట్ కొనుక్కోమని పది రూపాయలు కూడా ఇచ్చింది" అంటూ ఉత్తరం నా చేతిలో పెట్టి తుర్రుమన్నాడు ఆ అబ్బాయి.

కంగారుగా పేపరు మడతలు విప్పాను నేను. రమేశ్, పావని నా పక్కన వచ్చి నిల్చున్నారు. నాతో పాటు వాళ్లూ చదివారు.

"అయ్యా, అమ్మా...

"మీరెంత మంచివాళ్లో నాకు అర్థం అయింది. మీరు నా కోసం ఎంత ఆరాటపడ్డారో నాకు తెల్సు. ఓ అమ్మగా నాపై ప్రేమ పెంచుకున్నారనుకున్నానుకున్నాను. నన్ను రమ్మన్నారు. మరి నా కొడుకు? వాడు ఏమైపోతాడా అనే బెంగ నాకుందయ్యా. వాడ్నే కనిపెట్టుకుని ఉండాలంటే అది చెప్పినట్లు వినాలి. వినకపోతే వెళ్లిపొమ్మంటుంది. మీ పంచన చేరతా. మీరు నన్ను బాగా చూసుకుంటారు. కానీ ఈ పేగు తెంచుకుని పుట్టిన నా కొడుకు అక్కడెట్టా ఉన్నాడో అన్న ఆలోచన నన్ను క్రుంగదీస్తుంటే మీ దగ్గర ప్రశాంతంగా ఉండగలనా? అందుకే బాబూ ఎదిరించలేక పోతున్నాను. ఎదిరిస్తే ఎంత సేపు నిముషం పట్టదు. మీకు నేనెలా కావాలో నాకూ నా కొడుకు అలాగే కావాలయ్యా. మీకు అమ్మ ప్రేమ కావాలి. నాకు కొడుకు ప్రేమ కావాలి. అయ్యా... మీరిద్దరూ చల్లగా ఉండాలి. మన రాములవారు మిమ్మల్ని చల్లగా చూడాలి.

"ఉంటానయ్యా...

"బంగారి."

ఉత్తరం చదివింతర్వాత రమేశ్ త్వరపెట్టాడు త్వరగా వెళ్దామని. పావుగంటలో ముగ్గురం అక్కడున్నాం. ఎవరి అనుమతికోసమో చూడక హక్కుగా లోపలికి నడిచాం. ఏసోబు తల్లి మంచం మీదనే తల్లి పక్కన కూర్చుని ఏడుస్తున్నాడు.

"ఏసోబు" పిలిచాను నేను.

"అయ్యా.. మా అమ్మ" అంటూ ఏడుస్తూ చూపించాడు తల్లిని.

"బంగారీ...బంగారీ" వంగి పిలిచాను నేను.

కళ్లు తెరిచింది బంగారి. అదే చిరునవ్వు... నా హృదయాన్ని చీల్చే చిరునవ్వు...

నా వైపు చూశాడు రమేశ్. "అవునన్నయ్యా... అచ్చం అమ్మ చిరునవ్వే..." అన్నాడు ఉద్వేగంగా.

"నా తమ్ముడు" బంగారికి రమేశ్‌ని చూపించాను. దగ్గరికి రమ్మన్నట్లు సైగ చేసింది. ఏసోబు లేచి రమేశ్‌ని కూర్చోమన్నట్లు సైగ చేశాడు. చేతులు జోడించింది బంగారి.

ఆ చేతుల్ని బిగించి పట్టుకుని "బంగారీ, ఎట్లా వుంది?" ఎప్పటి నుండో పరిచయం ఉన్నట్లు ఎంతో ఆప్యాయంగా అడిగాడు రమేశ్. చేతులు పట్టుకుని నిమిరి ఏదో చెప్పబోయింది బంగారి... కానీ కళ్లు అలాగే చూస్తున్నాయి.

నాకు తెల్సు ఎనలేని కొదవలేని అమ్మ ప్రేమని ఆ స్పర్శతో ఎంతో హృద్యంగా పొందుతున్నాడని... అదీ కొన్ని సంవత్సరాల తర్వాత అమ్మ స్పర్శలో పునీతుడవుతున్నాడని.

"బంగారీ! బంగారీ!" రమేశ్ పిలుస్తున్నాడు. బంగారి కళ్లు అలాగే నిలిచిపోయివున్నాయి. క్షణాల్లో అర్థమై పోయింది అందరికీ... బంగారి చనిపోయిందని...!

"ఎవరికేం ప్రాప్తమో ఎవరం చెప్పగలం? ఆ ప్రాణాలు అలా ఆ చేతుల్లో పోయాయి' రమేశ్‌కి ఒక్కసారిగా దుఃఖం ముంచుకొచ్చింది. అమ్మ గుర్తొచ్చింది. నా చేతుల్లో వాలిపోయాడు.

నా కళ్ల నిండా కన్నీళ్లు నిలిచి చెంపల మీదుగా జారాయి. ఏసోబు తల్లిపై పడి ఏడుస్తున్నాడు. పావని కళ్లు తుడుచుకుంటూంది. మంగ దూరంగా నిలబడి ఉంది.

'ఏ అమ్మ అయినా అక్షయపాత్ర లాంటి ప్రేమ ఎందరికైనా పంచగలదు. పరిస్థితులు అనుకూలించాలి. అంతే, ఏ కొడుకు లైనా లేని అమ్మ ప్రేమ కోసం తహతహలాడు తుంటారు...కానీ అక్కున చేర్చుకునే అమృతహస్తం 'తమది' అని అన్పించాలి గదా. అందుకేనేమో ఇన్నిన్ని జ్ఞాపకాలు... ఆ జ్ఞాపకాల పొది నుండి ఒక్కో జ్ఞాపకాన్ని నెమరు వేసుకుంటారు.

మనుషులు చనిపోవచ్చు. కానీ బంధాలు చనిపోతాయా? ప్రేమ, పాశం పీట ముడుల్లాంటివి. అవి అందుకే మనుషుల్ని ఇంతగా బంధించి చోద్యం చూస్తుంటాయి. మానవత్వం ఉన్న మనుషులుగ నిలబెట్టగలుతున్నాయి.

రమేశ్ వైపు చూశాను. వాడు బంగారినే చూస్తున్నాడు. మధ్య మధ్య కళ్లు తుడుచుకుంటున్నాడు. ప్చ్... అన్ని ఆరాటాలూ ముగిశాయి.

నేను రాత్రి వాడికి ఫోను చేయకపోతే.. చేసినా వాడు రాకపోయివుంటే... ఏసోబు చేతిలో బంగారి ప్రాణం పోయి వుండేదా? నన్ను చూసిన బంగారి దగ్గరికి రమ్మని సైగ చేసి వుంటే ఏసోబు తన స్థానం నాకు ఇచ్చివుంటే బంగారి ప్రాణం నా చేతిలో పోయి వుండేదా?

ఇలాంటి ఆలోచనలు ప్రాణం ఉన్న జీవులకు. కట్టెగా మారిన ఆ జీవికి వీటన్నిటితో ఏం పని?

అందుకే ఎవరికి ఎవరు? చివరికి ఎవరు?'